క్లుప్తంగా

నేడు మంచు మనోజ్ మడకశిరకు రాక

మడకశిర: ప్రముఖ సినీనటుడు మంచు మనోజ్ కుటుంబ సమేతంగా శుక్రవారం మడకశిరకు రానున్నట్లు అభిమాన సంఘం నాయకులు గురువారం తెలిపారు. ఆయన ఉదయం 11 గంటలకు మడకశిరకు చేరుకుంటారన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అమరాపురం మండలంలోని హేమావతిలో సిద్ధేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారన్నారు. మళ్లీ హేమావతి నుంచి మధ్యాహ్నం 2 గంటలకు మడకశిరకు చేరుకుంటారన్నారు. సాయంత్రం 5 గంటల వరకూ మడకశిరలో అభిమానులకు అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం బెంగళూరుకు వెళతారని వారు తెలిపారు.

సంప్రదాయ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త

హిందూపురం: పట్టుగూళ్ల రైతులు చాకీ రేరింగ్ సమయంలో క్రిమిసంహారక మందుల జోలికి వెళ్లకుండా సంప్రదాయ పద్ధతుల్లో వేపనూనెలు ఉపయోగించడం శ్రేయస్కరమని ప్రాంతాయ పట్టు శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీ, రమ్యలు అన్నారు. గురువారం హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో నా పట్టు నా అభిమానం కార్యక్రమం ద్వారా రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మల్బరీ సాగుపై వారు మాట్లాడుతూ భూసార పరీక్షలు నిర్వహిస్తూ మొక్కల మధ్య అంతరం పాటించాలన్నారు. నాణ్యత, అధిక ఆకు దిగుబడుల కోసం పట్టుపురుగుల పోషణపై దృష్టి సారించాలని చెప్పారు. పురుగు మందుల జోలికి వెళ్లకుండా తెగుళ్లు, వ్యాధుల నుంచి రక్షణగా శాస్త్రీయ విధానాలను అవలంభించాలన్నారు. కార్యక్రమంలో హిందూపురం డీడీ ఉమామహేశ్వర్ రావు, మార్కెట్ సెరికల్చర్ అధికారి హంపయ్య, శరత్ చంద్రరెడ్డి రైతులు పాల్గొన్నారు.

బార్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: మడకశిర పట్టణంలో మద్యం బార్ ఏర్పాటుకు ఈ నెల 26 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ఎక్సైజ్ సీఐ మురళీకిషోర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బార్ కాలపరిమితి ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31 వరకు ఉంటుందన్నారు. బార్ లైసెన్స్ ఫీజు రూ.35 లక్షలు చెల్లించాలన్నారు. దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. దరఖాస్తు ఫీజు నాన్ రీఫండబుల్ అని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అందించాలన్నారు ఈనెల 28న బార్లకు డ్రా తీయనున్నట్లు ఆయన తెలిపారు.

అరసికెరె విద్యార్థుల సత్తా



ప్రశంస పత్రాలు చూపిస్తున్న విద్యార్థులు

పావగడ: స్థానిక క్రీడా మైదానంలో తాలూకా వ్యాప్తంగా నాలుగు హోబళీల స్థాయి క్రీడా పోటీల్లో అరసికెరె ప్రభుత్వ పాఠశాల బాలిక, బాలుర విభాగాల్లో ప్రతిభ చాటారు. ఖోఖో పోటీల్లో హోబళి స్థాయిలో విన్నర్‌గా నిలిచి తాలూకా స్థాయి పోటీలకు చేరుకున్నారు. అదే విధంగా అథ్లెటిక్స్‌లో 3 వేల మీటర్ల పరుగు పందెంలో కే బాబు, 1500 మీటర్ల పరుగు పందెంలో ఎస్.అజయ్ ద్వితీయ స్థానం సాధించి తాలూకా స్థాయికి చేరుకున్నారు. వారి విజయం పట్ల హెచ్‌ఎం రేణాకారాజ్, ఉపాధ్యాయులు హర్షం ప్రకటించారు. విజేతలను గురువారం సన్మానించారు.

గుడ్డం కోనేరును అభివృద్ధి చేద్దాం



గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ప్లాన్‌ను వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

హిందూపురం టౌన్: పట్టణంలోని వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసే గుడ్డం కోనేరు అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో హిందూపురం గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. గుడ్డం రంగనాథ స్వామి దేవాలయ కోనేటి సుందరీకరణను, అహుడా నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. సుందరీకరణకు ఎమ్మెల్యే బాలకృష్ణ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు దీనికి సంబంధించిన ప్లాన్‌ను సభ్యులకు వివరించారు. ప్రస్తుతం ఉన్న కోనేటిని ఇంకా పెద్దగా నిర్మించి, అలాగే దాదాపు 25 అడుగులు లోతు ఉండేటట్టు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేవాలయం పక్కన ఉన్న రథం ముందర 45 అడుగుల ఎత్తులో హైమాస్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, మున్సిపల్ ఎంఈ దస్తగిరి, డీఈ వాణి, జనార్దన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హిందూపురం పట్టణంలోని గాంధీ చౌక్‌లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిపై ఆవు దాడి చేసింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అతన్ని బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. ఈ ఘటన మే నెలలో జరిగింది.



ఈనెల 18న హిందూపురంలో రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై పశువుల ఆస్పత్రి వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తున్న వ్యక్తికి ఉన్నఫలంగా పశువుల మంద మీదకు రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. అతనికి గాయాలయ్యాయి. వెనుకవైపు నుంచి ఏ వాహనం రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..?

- రోడ్లపై పశువుల మందల సంచారం
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- వాహనదారులు, ప్రజలకు తప్పని అవస్థలు



రోడ్డుపై పాదచారులకు అడ్డంగా ఉన్న పశువులు

హిందూపురం టౌన్: హిందూపురం రోడ్లపై పశువుల సంచారంతో ప్రమాదాలు జరిగి ఏకం ప్రజలు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. దీంతో పట్టణ ప్రజలు రోడ్లపై తిరగాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం పశువులు రోడ్లపైనే ఉండడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు.

రోడ్లపైనే పశువుల మందలు తిష్ట..

పట్టణంలోని రోడ్లను పశువులు తమకు ఆవాసాలుగా మార్చుకున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఎన్టీఆర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, పశువుల ఆస్పత్రి వద్ద, గురునాథ్ సర్కిల్, చర్చి రోడ్డు, మెయిన్ బజార్, మార్కెట్ ఏరియాలో ఎక్కువగా పశువులు రోడ్లపై కూర్చుండిపోయి ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నాయి. అసలే రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో పశువులతో మరింత ఇబ్బందికరంగా మారింది. పశువుల యజమానులు వీడిని రోడ్లపైకి విడిచి పెడుతున్నారు. దాంతో రోడ్లపై ఉన్న చెత్త కాగితాలు, ఆకులు, ప్లాస్టిక్ కవర్లను తింటున్నాయి. రాత్రి సమయంలో వీటి సంచారం అధికంగా ఉంటోందని, గుంపులు గుంపులుగా రోడ్లపైకి వచ్చి అడ్డంగా నిలుస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఒక్కోసారి పశువులు రోడ్లపైనే పోట్లాటకు దిగి దుకాణాలు, మనుషులపైన దాడి చేస్తున్నాయి. ఇలాంటి ఘటనల్లో చాలా మందికి గాయాలయ్యాయి. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గోశాలకు తరలిస్తాం



రహదారిపై సంచరిస్తున్న పశువులకు సంబంధించి వాటి యజమానులు పశువులను వారం రోజుల్లోపు తీసుకెళ్లాలి. దీనిపై ప్రత్యేక బృందం ఏర్పాటు చేస్తున్నాం. రోడ్లపై పశువులు కనిపిస్తే వాటిని గోశాలకు తరలిస్తాం. ఇప్పటికే పశువుల యజమానులను దీనిపై హెచ్చరించాం. శాఖాపరమైన చర్యలకు వెనుకాడం.

– మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

హామీలిచ్చి అర్హుల పింఛన్లు తొలగిస్తారా?



తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఐక్యవేదిక నాయకులు

హిందూపురం: ఎన్నికల సమయంలో హామీలిచ్చి, అధికారంలోకొచ్చిన తర్వాత అర్హులందరి పింఛన్లు తొలగిస్తారా? అని ఐక్యవేదిక నాయకులు అన్నారు. గురువారం హిందూపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఐక్యవేదిక నాయకులు కిరణ్, శ్రీనివాసులు, అమానుల్లా, రవికుమార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదర్శ రాష్ట్రం కోసం సంపద సృష్టించడం అంటే దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయడమా? అని ప్రశ్నించారు. దివ్యాంగుల పింఛన్ల రీ సర్వే అంటూ అర్హులకు నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. హిందూపురం మండలంలోనే 147 మంది పింఛన్లు రద్దు చేశారని వాపోయారు. మున్సిపాల్టీ పరిధిలో వేలాదిగా తొలగిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం రద్దు చేసిన దివ్యాంగులు, వృద్ధుల పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీసీ నాయకులు అమానుల్లా, ఎంఐఎం నాయకులు మున్నా, ఎంఎస్‌ఎస్ రవికుమార్, ఏఐబీఎస్‌పీ హరికుమార్, బీఎస్‌పీ నాయకుడు సుబ్బరాయుడు, ఏపీఆర్ ఎస్‌పీ నౌషాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు,

చంద్రబాబు పచ్చి మోసకారి



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న హిందూపురం సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు : చంద్రబాబు పచ్చి మోసకారని, మరోసారి ఆయన మాటలు విని ప్రజలు మోసపోయారని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. హిందూపురం రూరల్ మండలం బేవినహళ్లి పంచాయతీలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల ద్వారా కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన మోసాలని వివరించారు. ఆయన చేసిన మోసాలని తెలిపే క్యూఆర్ కోడ్ పై ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను చంద్రబాబు వంచన చేశారని మండిపడ్డారు. ఉచిత బస్సు హామీ ఇచ్చి ఆంక్షలతో అమలు చేసారన్నారు. దివ్యాంగుల పెన్షన్లు ఆపి వారి ఉసురు తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నింటికీ కోతలు పెట్టి పథకాలు అమలులో పూర్తిగా వైఫల్యం చెందిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతాడన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగభూషణం, సర్పంచ్ ఆనంద్, వైఎస్సార్‌సీపీ మాజీ మండల్ కన్వీనర్ శ్రీరామ్ రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు విజయ్, మల్లేష్, శబరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



లేపాక్షిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



పెనుకొండలో వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు

పెనుకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లు గురువారం వినతి పత్రం అందించారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను మెయిన్ కార్యకర్తలుగా గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి బావమ్మ, కోశాధికారి మాబున్నీసా, సెక్టార్ లీడర్లు శ్యామల, సరస్వతి, మానీ, సుజాత, సుధా తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: అఖిలభారత అంగన్‌వాడీ యూనియన్ బ్లాక్ డే సందర్భంగా గురువారం రెండు అనుబంధ యూనియన్లు ఉమ్మడిగా మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: అంగన్‌వాడీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము, ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మిక సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలకనుగుణంగా 2014 నుంచి ఇప్పటి వరకు అంగన్‌వాడీ కార్మికులకు వేతనం పెంచలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే పీఏ వీరయ్యకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ కో కన్వీనర్ రామకృష్ణ, సెక్టర్ లీడర్స్ శిరీష, నాగమ్మ, పద్మ, రిహానా, రజిని, అయిషా, ఇందిర, సరిత, సావిత్రి, చంద్రకళ, శోభ, సునంద, కేథరిన్, సుమేర తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: తమ డిమాండ్లను పరిష్కారించాలంటూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు గురువారం అమరాపురంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మానవహారంగా ఏర్పడి డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేశారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు.

అగళి: తమ వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. బస్టాండ్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకూ వెళ్లి తహసీల్దార్ సుబ్బరావుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేయాలి



ఈరలక్కప్ప

మడకశిర: రాష్ట్రంలో పోలీసులు నిష్పక్షపాతంగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప గురువారం ఒక ప్రకటనలో కోరారు. పోలీసులు శాంతిభద్రతలను కాపాడకుండా, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టకుండా కూటమి నాయకుల సేవలో మునిగిపోవడం వ్యవస్థకు మంచిది కాదన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడాన్ని పోలీసులు మానుకోవాలన్నారు. అక్రమ కేసులను నమోదు చేసి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని పోలీసులను హెచ్చరించారు. టీడీపీ నాయకుల అవినీతి, అక్రమాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బయటపెడుతారనే భయంతోనే అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. పోలీసుల కనుసన్నల్లోనే రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగానికి అండగా నిలబడడం పోలీస్ వ్యవస్థకు మంచిదికాదన్నారు. కూటమి అరాచకపాలనతో రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. 2029 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిచి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



రొద్దంలో సభ్యత్వ నమోదు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

రొద్దం: పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్, జిల్లా అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ మల్లికార్జున, మండల శాఖ అధ్యక్షుడు అంజినేయులు, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, రమేష్‌బాబు, శ్రీనివాసులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఏపీటీఎఫ్ పూర్వపు జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శివన్న మాట్లాడుతూ ప్రభుత్వమేర్పడి ఏడాది కాలం గడిచినా నేటికీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఏమాత్రం చొరవచూపడం లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏతో పాటూ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. మండలాధ్యక్షుడు కృష్ణానాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు ఆనందరాజు, మల్లికార్జున, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా జ్యోతి ని వెలిగిస్తున్న మున్సిపల్ చైర్మన్

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పీయూ కళాశాలల క్రీడా పోటీలను స్థానిక మున్సిపల్ చైర్మన్ సుదేశ్ కుమార్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పోటీలకు పచ్చ జెండా ఊపారు. ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటములు సర్వసాధారణమని, ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో తుముల్ డైరెక్టర్ చంద్రశేఖరరెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు వేలు రాజ్, సంగీత నాగార్జునరెడ్డి, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ కమిటీ ఎన్నిక

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం మైదానంలో ఏఐవైఎఫ్ హిందూపురం నూతన కమిటీ ఎన్నికను గురువారం నిర్వహించారు. సత్యసాయి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కమల్ బాషా ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా జిలాన్ బాష, కార్యదర్శిగా నూర్ మహమ్మద్, సహాయ కార్యదర్శిగా పైరోజ్, ఉపాధ్యక్షుడిగా జిలాన్ ఖాన్, కోశాధికారిగా జిక్రియలను ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా వానే మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తొలగించిన వికలాంగుల పెన్షన్ తీవ్ర అన్యాయమని, పేదలపై ప్రభుత్వానికి కనికరం లేదా? అంటూ ప్రశ్నించారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల యూటీఎఫ్ కమిటీని గురువారం సాయంత్రం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.భూతన్న ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడిగా ఎ.నాగరాజు, అధ్యక్షుడిగా డి.శ్రీకాంత్, సహాధ్యక్షులుగా బి.ఉషారాణి, ఎం.చిన్నికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎ.అనిల్‌కుమార్, కోశాధికారిగా కె.అనిల్‌కుమార్, కమిటీ సభ్యులుగా ముస్కాన్‌వలి, నాగరూపకళ, శ్యాంప్రసాద్, కార్యదర్శులు భాగ్యలక్ష్మీ, నగేష్, కోమల, జిల్లా కౌన్సిలర్లుగా మహేష్, జయరాం, పవన్, రవికుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.నరసింహప్ప, మడకశిర మండల అధ్యక్షుడు వీఎన్ మహలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

పావగడ: పట్టణంలోని కావలగేరిలో ఓ శిథిలమైన నీటి ట్యాంక్‌ను కూల్చి వేస్తున్న సందర్భంలో ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. సుమారు 70 ఏళ్ల నాటి నీటి ట్యాంక్‌ను తొలగించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా షరీఫ్, షాహిద్, ఉజామా అనే ముగ్గురు కార్మికులను ట్యాంక్‌ను పగుల గొట్టడానికి నియమించారు. వారు ట్యాంక్‌లో దిగి పగులకొడుతుండగా ట్యాంక్ పైభాగం కూలింది. దీంతో ఇద్దరు కార్మికులు కిందకు పడ్డారు. మరో కార్మికుడు ట్యాంక్ లోపలే ఉండి పోయాడు. అగ్ని మాపక దళం సహాయంతో ట్యాంక్‌లో ఉన్న కార్మికుడిని సురక్షితంగా కిందకు దింపారు. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. మున్సిపల్ చైర్మన్ సుదేశ్ కుమార్, ముఖ్యధికారి జాఫర్ షరీఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని కార్మికులను కాపాడే దిశగా చర్యలు చేపట్టారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

పావగడ: స్థానిక జేఎంఎఫ్‌సీ కోర్టు న్యాయవాదుల భవనంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో న్యాయవాదులు, న్యాయ శాఖ ఉద్యోగ సిబ్బంది మధ్య జరిగిన క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో న్యాయవాదుల బృందం ప్రథమ స్థానంలో విజయం సాధించగా, ఉద్యోగ సిబ్బంది ద్వితీయ స్థానాన్ని చేజిక్కించుకుంది.ఈ సందర్భంగా సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి. మాదేశ్ మాట్లాడుతూ మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కోసం క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని న్యాయవాదులకు సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం, యోగా అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విజయం సాధించిన క్రీడాకారులకు న్యాయమూర్తులు మాదేశ్, మునిరత్నమ్మ బహుమతులు అందించారు.

'విగ్రహాల ఏర్పాటులకు అనుమతులు పొందండి'

పావగడ: ఈ నెల 27న గౌరి, వినాయక చవితి పండుగల నేపథ్యంలో వినాయకుడి ప్రతిమను ప్రతిష్ఠించే నిర్వాహకులు వివిధ ప్రభుత్వ శాఖ లలో పొందాల్సిన అనుమతులను తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏక గవాక్షి కేంద్రంలో పొందాలని తహసీల్దార్ వరదరాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిర్వాహకులు వినతి పత్రం అందించి అధికారులతో అనుమతులు పొందాలన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన

మడకశిర: పట్టణంలోని చైతన్య మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ర్యాంప్ ప్రోగ్రాంలో భాగంగా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పరిశ్రమల శాఖ విస్తరణాధికారి సంజీవరాజు, ఏపీఎం నాగమణి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

'పరిహారం అందించాలి'

మడకశిరరూరల్: నష్ట పరిహారం అందించిన తరువాతే పనులు చేపట్టాలని బాధితులు కోరారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం ఎత్తినహొళె (ఎత్తిపోతల పథకం) ప్రాజెక్ట్ పైప్‌లైన్ పనులు మడకశిర మండలం కదిరేపల్లి క్రాస్‌లో జరుగుతున్నాయి. కాలువ తవ్వే పనుల్లో భాగంగా అడ్డొచ్చిన పెద్ద బండరాళ్లను తొలగించేందుకు గతంలో బ్లాస్టింగ్ చేశారు. ఆ సమయంలో సమీపంలో నివాసం ఉన్న ఇళ్ల గోడలకు బీటలు వచ్చాయి. అప్పట్లో స్థానికులు అడ్డు చెప్పడంతో పనులు నిలిపి వేశారు. అయితే గురువారం సాయంత్రం ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండానే మరోమారు పనులు చేపట్టారు. దీంతో ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని బాధితులు కోరారు.

యువతి ఆచూకీ లభ్యం

రొళ్ల: పట్టణంలోని మారుతీకాలనీలో నివాసం ఉంటున్న గోవిందరాజు కుమార్తె అంజన ఆచూకీ లభ్యమైనట్లు గురువారం ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు. వివరాలు.. అంజన ఈనెల 10న ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయింది. చుట్టు

సంక్షిప్త సమాచారం

పక్కల గ్రామాలు, తెలిసిన వారి ఇళ్లల్లో గాలించిన ఫలితం లేకుండా పోయింది. దీంతో ఈ నెల14న యువతి తల్లి కవిత తమ కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు కర్ణాటక రాష్ట్రం కనకసంద్ర గ్రామంలోని బంధువుల ఇంట్లో యువతి ఉన్నట్లు గుర్తించారు. తర్వాత యువతిని పిలిపించి ఏఎస్‌ఐ హిదాయితుల్లా ద్వారా స్థానిక తహసీల్దార్ షేక్షావలి ఎదుట హాజరు పరచి కౌన్సెలింగ్‌తో పాటు బైండోవర్ చేయించారు. అనంతరం యువతిని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పరిగి: విద్యార్థుల, యువతను మత్తుపదార్థాలకు దూరంగా ఉం



డాలని ఎంఈఓ లక్ష్మీదేవి సూచించారు. గురువారం శీగిపల్లిలో ప్రాథమికోన్నత పాఠశాలలో పొగాకు ఉత్పత్తుల, మాదకద్రవ్యాల వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీని నిర్వహించిన అనంతరం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు క్రాంతి నేతృత్వంలో గ్రామంలో సంతకాలు సేకరించిన ముగ్గురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్, ఉపాధ్యాయులు చలపతి, గోపాల్, సుధాకర్‌రెడ్డి, విశ్వనాథ్, నాగరాజు, ప్రదీప్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి అశోక్‌కుమార్

పావగడ: ఆర్య ఈడిగ క్షేమాభివృద్ధి సంఘం రాష్ట్ర సంఘటనా కార్యదర్శిగా స్థానిక ఈడిగ సామాజిక వర్గం నాయకుడు అశోక్‌కుమార్ ఎంపికయ్యారు. బెంగళూరు లోని ఆర్య ఈడిగ సముదాయ భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాలూకాలోని కన్నమేడి గ్రామానికి చెందిన అశోక్ కుమార్ కోటగుడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హార్టికల్చర్ ఉపాధ్యాయుడిగా 25 సంవత్సరాలు ఒకే పాఠశాలలో విధులు నిర్వహించారు. అలాగే తాలూకా ఆర్య ఈడిగ సంఘం కార్యదర్శిగా విధులు నిర్వహించి ఆర్య ఈడిగ సంఘం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయన ఎంపికపై స్థానిక తాలూకా ఈడిగ సంఘం పదాధికారులు హర్షం ప్రకటించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

రొద్దం: మహిలకు చట్టాలపై అవగాహన అవసరమని అనంత శక్తి సొసైటీ సీఈఓ లావణ్య పేర్కొన్నారు. గురువారం కందుకూర్లపల్లిలో అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు సుశీలమ్మ సమక్షంలో చట్టాలపై అవగాహన కల్పించారు. సొసైటీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల వితరణ

గుడిబండ: మండలంలోని కరికెర గ్రామంలో ఉన్న కేజీబీవీ బాలికల కళాశాలకు గురువారం చిగతుర్పి గ్రామానికి చెందిన మంజునాథ్ రూ.30 వేలు విలువ చేసే 8 సీసీ కెమెరాలను వితరణ చేశారు. ఆయనకు ప్రిన్సిపాల్ రమాదేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

చైన్‌స్నాచింగ్ యత్నం

పెనుకొండ: స్థానిక ఎగువగడ్డలో చైన్‌స్నాచింగ్‌కు దుండగులు విఫలయత్నం చేశారు. ఆ ప్రాంతంలో నివాసముంటున్న వృద్ధురాలు రత్నమ్మ గురువారం ఉదయం 10 గంటల సమయంలో స్నానం చేసి ఇంటి ఆవరణలో తల తుడుచుకుంటుండగా ముసుగులు ధరించిన ఇద్దరు యువకులు అక్కడకు చేరుకున్నారు. ఓ యువకుడు బయల నిల్చుకోగా.. మరో యువకుడు వృద్ధురాలితో మాటలు కలిపి ఇంట్లో దోషం ఉందని, శాంతి చేయకపోతే నష్టపోతారంటూ మభ్య పెట్టే ప్రయత్నం చేస్తూ ఆమె మెడలోని ఆరు తులాల బరువున్న బంగారు చైన్ లాక్కొనే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో వృద్ధురాలు గట్టిగా కేకలు వేయడంతో చైన్‌స్నాచింగ్ యత్నాన్ని విరమించుకుని పరారయ్యారు. కుమారుడు మహేష్, చుట్టుపక్కల వారు గాలించినా దుండగుల ఆచూకీ లభ్యంకాలేదు. కాగా, ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు పేర్కొన్నారు.

వివాహేతర సంబంధంతో వ్యక్తి హత్య

గుడిబండ: వివాహేతర సంబంధంతో ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన స్థానిక గుడిబండ పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులల వివరాల మేరకు... పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన రంగప్ప కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. రంగప్పకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు మంజునాథ్ గత కొన్ని రోజులుగా మండలంలోని మోపురగుండు గ్రామానికి చెందిన మారెక్కతో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. మోపురగుండులో ఉన్న అక్క రమాదేవిని చూడటానికి బుధవారం రాత్రి మంజునాథ్ వచ్చాడని తెలుసుకుని.. మారెక్క తల్లి చంద్రమ్మ, భాగ్యమ్మ, లింగమ్మ కలసి మంజునాథ్‌ను తాడుతో కట్టివేసి ఇనుపరాడ్లతో తీవ్రంగా గాయపరిచారు. బంధువులు అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మడకశిర ఆసుపత్రికి తరలించగా.. గురువారం మధ్యాహ్నం చికిత్స ఫలించక అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు తండ్రి రంగప్ప ఫిర్యాదు మేరకు మారెక్క, చంద్రమ్మ, బాగ్యమ్మ, లింగమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

సోమందేపల్లి: మండల కేంద్రంలో ఓ యువకుడు గురువారం రాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. మండల కేంద్రంలోని పాతూరుకు చెందిన సోము (24) ఇంటి వద్దనే మద్యంలో పురుగుల మందు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తర్వాత అనంతపురం తీసుకెళ్లారు. ప్రేమ వ్యవహారమే ఘటనకు కారణమని తెలిసింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.